RNI NO: TEL/TEL/2009/28544
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
# పీపుల్స్ డైరీ
సమగ్ర వార్తా దినపత్రిక
విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం
సంపుటి : 18 సంచిక : 130
Vol : 18 Issue : 130
Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044
వరంగల్, శుక్రవారం 17 జూలై 2026
Warangal, Friday 17 July 2026
పేజీలు : 08 వెల రూ : 4-00
Pages : 08 Price : 4-00

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
• హనుమకొండ • కరీంనగర్
• భూపాలపల్లి • పెద్దపల్లి/రామగుండం
• జనగామ • మహబూబాబాద్
• హైదరాబాద్ • నిజామాబాద్
Cell : 9493019044
9618509859

## ఇస్రోలో వందమందికిపైగా శాస్త్రవేత్తల రాజీనామా?

కలకలం రేపుతున్న వారి నిర్ణయం
కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం
ఇస్రోలో ఏం జరుగుతుందనే చర్చ!

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో శాస్త్రవేత్తల రాజీనామాలు కలకలం రేపుతున్నాయి. ఒకరు ఇద్దరు కదా ఏకంగా 120 మంది రాజీనామాలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. చంద్రయాన్-3 మిషన్ విజయంతో యావత్తు ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్న ఇస్రో లో ఈ పరిణామం ఆందోళనకు గురిచేస్తోంది. పలు ప్రతిష్ఠాత్మక మిషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వచ్ఛంద పదవీ విరమణలు, రాజీనామాలపై నిబంధనలను కఠినతరం చేస్తూ ఇస్రో ప్రధాన కేంద్రాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. జులై 14న యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి కేంద్రాలకు జారీ చేసిన అంతర్గత మెమోలో ప్రతిష్టాత్మక మానవసహిత (మిగతా 2లో...)







## మెరుగుపడని జాబ్‌మార్కెట్

» యధాతదంగా కొనసాగుతున్న నిరుద్యోగిత రేటు
» ఉద్యోగ కల్పన పుంజుకునేదెన్నడు?
» లేబర్ రిపోర్ట్‌లో బయటపడ్డ కీలక నిజాలు!

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : దేశంలో జాబ్ మార్కెట్ మిశ్రమ ఫలితాలను చూపిస్తోంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన తాజా 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' వివరాల ప్రకారం.. గత జూన్ నెలలో దేశంలో నిరుద్యోగిత రేటు ఎటువంటి మార్పు లేకుండా స్థిరంగా 5.5 శాతంగానే నమోదైంది. ఒకవైపు నగరాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దేశీయ శ్రమశక్తిలో మహిళల భాగస్వామ్యం గత 12 నెలల కనిష్ట స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

దేశంలో 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (LFPR) జూన్ నెలలో 54.4 శాతంగా నమోదైంది. అయితే, మహిళా కార్మిక భాగస్వామ్య రేటు మాత్రం మే నెలలోని 32.8 శాతం నుంచి జూన్ నాటికి 32.7 శాతానికి స్వల్పంగా పడిపోయింది. గత ఏడాది జూన్ (2025)లో ఇది 32.0 శాతంగా ఉండగా, ఆ తర్వాత ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి. (మిగతా 2లో...)



## త్వరలో మద్యం ధరల పెంపు?



మద్యం ప్రియులకు షాక్..
ధరల బాదుడుకు రంగం సిద్ధం!

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణాలో మద్యం ప్రియులకు చేదువార్త. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ధరలు పెరిగే అవకాశం ఉందని తాజాగా సంకేతాలు కనిపి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణా సర్కార్ మద్యం ధరల నిర్ణయ కమిటీని ఏర్పాటు చేసి ధరల విషయంలో నిర్ణయం తీసుకోవటం కోసం జులై 17న సమావేశం నిర్వహించనుంది. ఇప్పటికే మద్యం తయారీ సంస్థలు ప్రభుత్వానికి ధరల సవరణ కోసం అనేకమార్లు విజ్ఞప్తి చేశాయి. ఈ క్రమంలో ధరల నిర్ణయ కమిటీని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మద్యం (మిగతా 2లో...)



## హైదరాబాద్‌లో బోనాల సందడి

గోల్కొండలో తొలి బోనంతో ఆషాఢ ఉత్సవాలకు శ్రీకారం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో నిర్వహించే ఈ మహోత్సవాలకు ఆద్యంగా, గోల్కొండ కోటపై కొలువైన శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ఈ తొలి బోనంతో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు జరిగే బోనాల సంబరాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. గోల్కొండలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ, పోతురాజుల విన్యాసాలు, డప్పుల మోతలు, జానపద కళారూపాల నడుమ ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో కళకళలాడుతున్నాయి. "జై మహంకాళి" నినాదాలతో గోల్కొండ కోట ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలు, (మిగతా 2లో...)

■ ఉద్యోగి... బీపీఎల్ లబ్ధి

## ప్రభుత్వానికే టోపీ!

» సం'క్షేమంగా' స్వాహా వ్యవహారం
» ప్రభుత్వ ఉద్యోగి భాగోతం బట్టబయలు
» తన భార్య పేరిట బీపీఎల్ కింద రేషన్‌కార్డు పొందిన వైనం
» రెవెన్యూ అధికారుల జేబులు తడిపి అక్రమ తంతు

పీపుల్స్‌డైరీ-భూపాలపల్లి : అక్కడక్కడా ప్రభుత్వ ఉద్యోగులు తమకు అర్హత లేకున్నప్పటికీ బీపీఎల్ కింద రేషన్‌కార్డులు పొంది అప్పనంగా ప్రభుత్వ పథకాలను దోచేస్తున్న సంఘటనలు జరుగుతుంటాయి. అలాంటిదే ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ ఉద్యోగి తన భార్యకు బీపీఎల్ క్రింద రేషన్ కార్డులో పేరు నమోదు చేయించి కొన్నేండ్లుగా ప్రభుత్వ పథకాలను అప్పనంగా పిండేసుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం అందుకుతండాకు చెందిన చెందిన కొత్తపల్లి రాజయ్య కూతురు సంధ్యారాణికి 2017 సంవత్సరంలో పరకాలకు చెందిన నేరెళ్ల కృష్ణతో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొద్ది కాలానికి బిపిఎల్ కింద మంజూరి అయినా రాజయ్య రేషన్ కార్డునుండి సంధ్యారాణి పేరును తొలిగించారు. అప్పటికే రాజయ్య అల్లుడు నేరెళ్ల కృష్ణ విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగి (మిగతా 2లో...)

## అలల్లో అంతిమయాత్ర



■ బంగాళాఖాతంలో ఘోర ప్రమాదం?
■ రెండు పడవలు బోల్తా.. 500 మందికిపైగా మృతి?
■ జూన్ చివరి వారంలో మయన్మార్ నుంచి బయలుదేరిన ఒక పడవ
■ జులై 8న అయేయార్వాడి నది సమీపంలో మరో పడవ
■ ప్రతికూల వాతావరణం, భారీ వర్షాలతో ప్రమాదం

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : మయన్మార్ తీరంలోని బంగాళాఖాతంలో రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు పడవలు బోల్తా పడి 500 మందికి పైగా మరణించినట్లు ఐక్యరాజ్యసమితి గురువారం ప్రకటించింది. మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు ప్రయాణిస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగినట్టు తెలిపింది. ఇటీవలి కాలంలో జరిగిన అత్యంత ఘోరమైన పడవ ప్రమాదాల్లో ఇది ఒకటని ఐరాస పేర్కొంది. భారీ ప్రాణనష్టం పట్ల అంతర్జాతీయ వలసదారుల సంస్థ (ఐఓఎం), ఐక్యరాజ్యసమితి శరణార్థుల హై కమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. జులై మొదటి వారంలో జరిగిన ఈ ఘటనలో బాధితుల గురించి కచ్చితమైన వివరాలు అందుబాటులో లేవని ఐరాస వివరించింది. (మిగతా 2లో...)

## శునకం విషాద గాథ

యజమాని మరణంతో ప్రాణాలు విడిచిన కుక్క



2లో



## దుష్ప్రచారానికి సవాల్

పత్రాలే సాక్ష్యం... న్యాయమే ఆధారం
పట్టా భూమిని దేవాలయ భూమిగా ప్రచారం
పనిగట్టుకుని మా కుటుంబాన్ని వేధిస్తున్నారు
ఎకరం భూమిని స్వాహా చేయటానికి ప్రయత్నం
కోట్ల రూపాయల భూమిని కాజేయాలనే ప్లాన్
సరైన పత్రాలు లేకున్నా కోర్టు చుట్టూ తిప్పుతున్నారు
న్యాయస్థాన ఉత్తర్వులు బేఖాతరు చేస్తున్న కబ్జాదారులు
కాశీబుగ్గ శివాలయ స్థల వివాదంలో బాధితులు
విలేకరుల సమావేశంలో రాచర్ల కుటుంబం

2వ పేజీలో..

# ఇస్రోలో వందమందికిపైగా శాస్త్రవేత్తల రాజీనామా?

(మొదటి పేజీ తరువాయి)

అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ సహా ఇతర ముఖ్యమైన మిషన్లతో సంబంధం ఉన్న గ్రూప్ 'ఏ' సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామా లేదా వీఆర్‌ఎస్ అభ్యర్థనలను అంగీకరించవద్దని ఆదేశించింది.

రాజీనామాలను ఇకపై సాధారణ పరిపాలనా ప్రక్రియగా పరిగణించరు. ఇప్పటి వరకు సంబంధిత కేంద్రాల డైరెక్టర్లు ఈ అభ్యర్థనలను ఆమోదించేవారు. కానీ, ఇకపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ నుంచి తుది అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో నిర్ణయాధికారం కేంద్ర పరిధిలోకి వెళ్లిపోయింది. సైంటిస్ట్, ఇంజనీర్ అంతకంటే తక్కువ హోదాలో ఉన్నవారి రాజీనామా అభ్యర్థనలను, తుది నిర్ణయం కోసం ఆయా కేంద్రాల డైరెక్టర్లు స్పష్టమైన సిఫార్సులతో తమకు పంపాలని స్పష్టం చేసింది.

సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణపై నిర్ణయం తీసుకునేలా ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు, చీఫ్‌లకు అనుమతిస్తూ 2020లోని ఇచ్చిన పరిపాలనాపరమైన అధికారాన్ని తాజాగా రద్దుచేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్,నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్, మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ వంటి కేంద్రాలకు కూడా ఈ ఉత్తర్వు జారీ చేసింది.

వీరి రాజీనామాలకు కారణాన్ని ఇస్రో అధికారికంగా వెల్లడించలేదు. కానీ, అంతరిక్ష రంగంలోకి ప్రైవేట్ సంస్థలను అనుమతిస్తూ 2020లో కేంద్రం తీసుకొచ్చిన స్పేస్ పాలసీనే కారణమని తెలుస్తోంది. ప్రైవేట్ రంగం వేగంగా విస్తరించడం, స్టార్టప్‌లు, ఏరోస్పేస్ సంస్థలు అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలకు ఆకర్షణీయ అవకాశాలు కల్పించడంతో వీరు అటువైపు చూస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో 400కుపైగా స్పేస్ స్టార్టప్‌లు నమోదయ్యాయి. ఇవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించగా, కేవలం 2025లోనే దాదాపు 150 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.

# మెరుగుపడని జాబ్‌మార్కెట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది జనవరిలో మహిళల భాగస్వామ్యం అత్యధికంగా 35.3 శాతానికి చేరినప్పటికీ, ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి భాగస్వామ్యం 36.7 శాతం నుంచి 36.6 శాతానికి తగ్గడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అదే సమయంలో పట్టణ ప్రాంత మహిళల భాగస్వామ్యం ఎటువంటి మార్పు లేకుండా 24.8 శాతంగానే కొనసాగింది. అయితే, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే మహిళల భాగస్వామ్య రేటు 0.7 శాతం మేర మెరుగ్గా ఉండటం గమనార్హం.

పట్టణాల్లో పెరిగిన ఉపాధి.. ఉపాధి రంగంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కార్మిక శ్రమశక్తి భాగస్వామ్యం మే నెలలోని 49.8 శాతం నుంచి జూన్‌లో 50.1 శాతానికి పెరిగింది. అలాగే నగరాల్లో కార్మికుల జనాభా నిష్పత్తి కూడా 46.8 శాతానికి చేరడంతో, నగరాల్లో కొత్త ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నట్లు స్పష్టమవుతోంది. అయినప్పటికీ, పట్టణ నిరుద్యోగిత రేటు మాత్రం 6.4 శాతం నుంచి 6.6 శాతానికి పెరిగింది.

గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే, నిరుద్యోగ రేటు స్వల్పంగా తగ్గి 5.0 శాతానికి పరిమితమైంది. ఫిబ్రవరి నెల నుంచి గ్రామీణ నిరుద్యోగిత నిరంతరం పెరుగుతూ రాగా, జూన్ నెలలో ఈ రేటు మే నెలకు (5.1 శాతం) తో పోలిస్తే కొద్దిగా తగ్గడం గ్రామీణ ప్రజలకు కొంత ఊరటనిచ్చే అంశం.

మహిళలతో పోలిస్తే పురుషుల ఉపాధి గణాంకాలు ఈ నెలలో మెరుగ్గా ఉన్నాయి. మే నెలలో 72.5 శాతంగా ఉన్న పురుషుల శ్రామిక జనాభా నిష్పత్తి జూన్ నాటికి 72.9 శాతానికి పెరిగింది. అదే సమయంలో పురుషుల నిరుద్యోగిత రేటు కూడా 5.4 శాతం నుంచి 5.3 శాతానికి స్వల్పంగా తగ్గడం సానుకూల పరిణామంగా చెప్పవచ్చు.

# త్వరలో మద్యం ధరల పెంపు?

(మొదటి పేజీ తరువాయి)

ధరల పెంపు, కొత్త ధరల అమలు, బాటిల్స్ సైజ్ వంటి అనేక ముఖ్యమైన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మద్యం తయారీ డిస్టలరీలకు మద్యం ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా వ్యయాలు బాగా పెరిగిన నేపథ్యంలో తయారీదారులు ధరల పెంపుకు పట్టుబడుతున్నారు. ప్రస్తుత ధరలతో విక్రయాలు చేయటం కష్టంగా మారిందని వారు ధరల నిర్ణయ కమిటీకి వివరించినట్టు సమాచారం. అయితే ఈ కమిటీ అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుని సరైన నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు. అయితే ఒకేసారి భారీగా ధరలు పెంచకుండా క్రమంగా సర్దుబాటు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే కొన్ని నివేదికల ప్రకారం ధరలు 10 నుండి 20 శాతం వరకు పెంచే ఆలోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇంకా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చెయ్యలేదు. ధరల విషయం మాత్రమే కాకుండా బాటిళ్ళ సైజ్ విషయంలో కూడా నిర్ణయం తీసుకోనున్నారు. కొత్తగా 150ఎంఎల్ సైజ్ బాటిల్స్ ప్రవేశపెట్టాలని తయారీ సంస్థల సూచనలను కూడా పరిశీలించనున్నారు. మార్కెట్ లో కొత్తగా వీటిని తీసుకురావటం, వినియోగదారులకు మరిన్ని ఎంపికలు చేసుకునే అవకాశం కల్పించాలని కూడా ఆలోచిస్తున్నట్టు సమాచారం. అన్ని అంశాలపై సమావేశంలో చర్చించి ప్రభుత్వం వినియోగాదారులపైనా భారీగా భారం పడకుండా తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో బోనాల సందడి

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసర సేవల కోసం అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

భద్రతా పరంగా కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

గోల్కొండలో ప్రారంభమైన ఈ బోనాల ఉత్సవాలు రాబోయే రోజుల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, హైదరాబాద్ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటు తెలంగాణలోని అనేక మహంకాళి దేవాలయాల్లో అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. బోనాల పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భక్తి, భద్రత, సంస్కృతి, సంప్రదాయాల కలయికతో ఆధ్యాత్మిక శోభ నెలకొననుంది.

# దుష్ప్రచారానికి సవాల్

- పత్రాలే సాక్ష్యం... న్యాయమే ఆధారం
- పట్టా భూమిని దేవాలయ భూమిగా ప్రచారం
- పనిగట్టుకుని మా కుటుంబాన్ని వేధిస్తున్నారు
- విలేకరుల సమావేశంలో రాచర్ల కుటుంబం

**పీపుల్స్ డైరీ ప్రతినిధి, వరంగల్**





కాశిబుగ్గ శ్రీ శివాలయం పేరుతో తమ పట్టా భూమిపై కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న కథనాలు వాస్తవాలకు విరుద్ధమని రాచర్ల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు తెలిపారు. తమ పట్టా భూమి ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. తమ తండ్రి రాచర్ల విశ్వనాథం 1970లో వద్దిరాజ్ కుటుంబం నుంచి రిజిస్టర్డ్ అమ్మకపు పత్రం ద్వారా భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశామని అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర రికార్డులు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. భూమి వివాదంపై న్యాయస్థానంలో విచారణ అనంతరం వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఓఎస్ నెం.410/2022లో రాజీ నిబంధనల మేరకు డిక్రీ జారీ చేసిందని కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామన్నారు. కాశిబుగ్గ శ్రీ శివాలయానికి చెందిన ఒక్క గజం భూమిపైనా తమకు ఎలాంటి హక్కు లేదని, తమ తండ్రి కొనుగోలు చేసిన పట్టా భూమిపైనే హక్కు వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు 2010 లో ఏడీ సర్వే ఆధారంగా అప్పటి వరంగల్ మండల తహసీల్దార్ నిర్వహించిన విచారణలో సంబంధిత భూమి పట్టా భూమేనని, అందులో 24 గుంటలు రాచర్ల శ్రీనివాస్ పేరుపై ఉన్నట్లు, 9 గుంటల్లో వాటర్ ట్యాంక్, మిగిలిన విస్తీర్ణంలో ఆబాది కింద ఇళ్లు ఉన్నట్లు నివేదిక ఇచ్చారని తెలిపారు. అలాగే దేవాదాయ శాఖ అధికారులు సైతం విచారణ నిర్వహించి సుమారు 2,800 గజాల పట్టా భూమి తమదేనని పేర్కొంటూ నివేదిక అందజేశారని చెప్పారు. గుడి అభివృద్ధి కమిటీ పేరుతో కొందరు ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండానే గత రెండు దశాబ్దాలుగా తమపై కేసులు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గుడి భూమిగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వారి వద్ద చట్టబద్ధమైన పత్రాలు ఉంటే బహిరంగంగా చూపించాలని సవాల్ విసిరారు. కొంతమంది పనిగట్టుకుని ఓ న్యాయవాదితో కలిసి స్థానిక నాయకులకు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఆరోపించిన రాచర్ల కుటుంబ సభ్యులు, ఈ వ్యవహారంపై పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులు తమ వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి వాస్తవాలు నిర్ధారించాలని కోరారు. అసత్య ప్రచారం కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ కుటుంబానికి ఎటువంటి హాని జరిగిన పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



# అలల్లో అంతిమయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రుతుపవన వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపింది. ప్రాథమిక నివేదికల ప్రకారం.. శరణార్థులతో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి జూన్ చివరి వారం ఈ పడవలు బయలుదేరాయి. ఇందులోని ప్రయాణికులు బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు చెందినవారని భావిస్తున్నారు. దాదాపు 250 మందితో వెళ్తున్న పడవల్లో ఒకటి.. తీరం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే సంబంధాలు కోల్పోయింది. అలాగే, జులై 8న మయన్మార్ అయేయార్వాడి నది తీరంలో 280 మందితో ప్రయాణిస్తున్న మరో పడవ బోల్తా పడినట్లు సమాచారం. రుతుపవనాలు, తుఫాన్ల కారణంగా బంగాళాఖాతంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో రోహింగ్యాలు అరుదుగా ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సమయంలో ఈ ఘోరమైన విపత్తు సంభవించింది. రుతుపవనాల కారణంగా ఆ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు, విస్తృతమైన వరదలతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారి ఉండొచ్చని ఐక్యరాజ్యసమితి సంస్థలు పేర్కొన్నాయి. మయన్మార్ రఖైనా రాష్ట్రంలో తీవ్ర హింస, పేదరికం నుంచి తప్పించుకునే ప్రయత్నాల్లో భాగంగా రోహింగ్యా శరణార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సైనిక అణచివేతతో ఆ దేశం నుంచి పారిపోయి వచ్చిన సుమారు 12 లక్షల మంది బంగ్లాదేశ్‌లోని కిక్కిరిసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. మయన్మార్‌లో ఉన్నవారు తీవ్రమైన ఆంక్షలతో నిర్బంధ శిబిరాల్లోనే జీవించాల్సిన పరిస్థితులు నెలకున్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నల్లబెల్లి జులై 15 (పీపుల్స్ డైరీ) : పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి అని మనస్థాపం చెంది ఓ రైతు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, అయోధ్యనగర్ గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అయోధ్య నగర్ గ్రామానికి చెందిన పుప్పాల దేవేందర్ (35) అనే రైతుకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీంతో పాటు ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు ఈ నేపథ్యంలో పంట సాగు కోసం అప్పులు తీసుకొని పెట్టుబడిగా ఉపయోగించాడు. ఈ ఏడు వర్షాలు సరిగా కురువకపోవడంతో పంటలు సరిగా పండక నష్టపోయాడు. మరోపక్క పంట సాగు కోసం తెచ్చిన అప్పులు ఏ విధంగా తీర్చాలి అని మనస్థాపం చెంది నల్లబెల్లి మండలం శనిగరం శివారులోని జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టుకు గురువారం ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటనను గమనించిన బాటసారిలు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై సాయి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.



# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందించాలి



**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు అందించాలని టీయూడబ్ల్యూజే హెచ్ 143- రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో గురువారం జిల్లా జర్నలిస్టుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్ హాజరై మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో తమ యూనియాన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందజేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో ఉన్న జర్నలిస్టుల కమిటీ నాయకులు ప్రిట్, ఎలక్ట్రానిక్ మీడియాలు పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అరకొరకగా ఇస్తు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదు పెంచాలని, జిల్లా కలెక్టర్, ఎస్పీ స్నేహ షబరిష్, హెల్మెట్ ధరించాలని ప్రజలకు, ఉద్యోగస్తులకు అవగహన కల్పించారని, ప్రతి జర్నలిస్టు హెల్మెట్ ధరించాలని వారి కుటుంబని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు తీగల కృష్ణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఈరగాని బిక్షం, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్, నాయకులు కరుణకర్, ప్రసాద్, కిరణ్, వెంకన్న, శ్రీధర్, చక్రధర్, సుబ్రమణ్యం, శ్రీనివాస్, రాజేశ్వర్, వినోద్రెడ్డి, నారాయణరావు, సంతోష్, విష్ణు, మహేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# శునకం విషాద గాథ

**యజమాని మరణంతో ప్రాణాలు విడిచిన కుక్క**

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో చోటుచేసుకున్న ఓ హృదయ విదారక ఘటన ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది. సుమారు పదేళ్లుగా ఏళ్లుగా తన యజమానితో కలిసి జీవించిన ఓ పెంపుడు కుక్క, యజమాని మరణాన్ని తట్టుకోలేక చివరికి ప్రాణాలు విడిచింది. ఈ ఘటన అక్కడి ప్రజలను కన్నీటి పర్యంతం చేసింది.

సివిల్ లైన్స్ ప్రాంతానికి చెందిన 67 ఏళ్ల ప్రదీప్ జైన్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం భోపాల్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఆయన ఆరోగ్యం విషమించడంతో కన్నుమూశారు. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన బేతుల్‌కు తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు అంతా శోకసంద్రంలో మునిగిపోయిన వేళ, ఆయనకు అత్యంత ఆప్తుడైన పెంపుడు కుక్క 'దుగ్గు' కూడా తీవ్ర ఆవేదనకు గురైంది.




యజమాని మృతదేహాన్ని ఇంట్లో ఉంచినప్పటి నుంచి దుగ్గు ఆయన వద్దకే వెళ్లాలని ప్రయత్నించింది. మృతదేహాన్ని వదిలి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు దానిని మరో గదిలో ఉంచారు. రాత్రంతా అది ఏడుస్తూ అశాంతిగా గడిపింది. యజమాని లేచి వస్తాడనే ఆశతో ఎదురుచూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరుసటి రోజు అంత్యక్రియల ఊరేగింపు ప్రారంభమైనప్పుడు దుగ్గును కూడా బయటకు తీసుకువచ్చారు. యజమాని శవపేటిక వెంట కొన్ని అడుగులు మాత్రమే నడిచిన తర్వాత అది ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఈ దృశ్యం అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది.

# ప్రభుత్వానికే టోపీ!

(మొదటి పేజీ తరువాయి)

కావటంతో రేషన్ షాప్ డీలర్ సమాచారంతో అప్పటి రెవెన్యూ శాఖ అధికారులు రేషన్ కార్డు నుండి సంధ్యారాని పేరును తొలిగించారు. అప్పటి వరకు అంత బాగానే ఉన్నా నేరెళ్ల కృష్ణ వక్ర బుద్ధిని ప్రదర్శించినట్టు స్పష్టమవుతోంది. ప్రభుత్వ పథకాలల్లో సైతం లబ్ది పొందాలన్న దురలోచనతో తన పలుకుబడిని ప్రదర్శించి తన భార్య సంధ్యరాణి పేరును రెవెన్యూ అధికారుల "జేబునింపి" తిరిగి కొత్తపల్లి రాజయ్య రేషన్ కార్డులోనే నేరెళ్ల సంధ్యారాణిగా పేరును అదే పేరుతో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పొందుతున్నట్టు సమాచారం. అంతే కాకుండా ఇటీవల తన భార్యకు రెండు సార్లు కూడా ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్‌లు సైతం చేపించి లబ్ది పొందారు. రేషన్ తీసుకోవటం, ప్రతి బతుకమ్మ పండగలకు ప్రభుత్వం పేదలకు అందించే చీరలను కూడా వదులుకోలేదంటే వారు ఏ విధానాన్ని అవాలంబిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఉద్యోగులే ఇలా ప్రభుత్వాన్ని, అటు అధికారులను మోసం చేస్తూ లబ్ధిపొందుతుంటే అధికారులు ఏంచేస్తున్నట్టో అర్థంకాని విషయం. నేరెళ్ల కృష్ణ ప్రస్తుతం కూడా అధికారులను మేనేజ్ చేస్తున్నట్టు కనిపిస్తుంది. దీంతో రమేష్ అనే వ్యక్తి... పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను అప్పనంగా దోచుకుతింటూ ప్రభుత్వ కొలువు చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న నేరెళ్ల కృష్ణ, అయన సతీమణి సంధ్యరాణిపై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.




# 'సర్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**మండల నరసింహా రాములు**

వరంగల్, జూలై 16 (పీపుల్స్‌డైరీ) : భారత ఎన్నికల సంఘం ఓటర్ జాబితాలో సవరణ కోసం తీసుకువచ్చిన 'సర్ 'లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కాకతీయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మండల నరసింహా రాములు పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలో గల రంగశాయిపేటలోని కురుమ సేవా సంఘం భవనంలో 'సర్ 'ప్రక్రియను ఏర్పాటు చేశారు. కాకతీయ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మండల నరసింహా రాములు హాజరై ఓటర్ నమోదు పత్రాన్ని బిఎల్‌ఓకు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారాములు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలో సవరణ కోసం తీసుకువచ్చిన ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఓటు హక్కును పొందాలని అన్నారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఓటు హక్కును అందించారని నరసింహ రాములు అన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంతం తారా మోహన్, శ్రీరామోజు మొహనాచారి, మునుకుంట్ల చంద్రమౌళి షేర్ల మహేందర్ కర్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్‌డైరీ
వరంగల్
శుక్రవారం, 17 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 130


# పలు కుటుంబాలను పరామర్శించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ఏటూరు నాగారం జూలై 16 (పీపుల్స్ డైరీ) :** మంగపేట మండలశీలోని పలు శోకతప్త కుటుంబాలను పరామర్శించిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఈరోజు మంగపేట మండలంలో మల్లూరు, పురేడ్పల్లి, కత్తి గూడెం,గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను కలిసి, వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతులు ఆరెల్లి కాంతమ్మ, రాళ్ల మహేష్ ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు సరికాదు

**టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబా**



**ఆళ్ళపల్లి జూలై 16 (పీపుల్స్ డైరీ) :** నియోజకవర్గంలో ముగ్గురు మంత్రుల పర్యటన నేపథ్యంలో ఆళ్ళపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం సోమేశ్వర్ గురువారం నాడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామయ్య చింటూ ఖలీ ద్. అరీప్ లను ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు తమ అభిప్రాయాలను తెలిపె అక్కు ఉందని షేక్ బాబా పేర్కొన్నారు ఎలాంటి ఘటనలు జరగకముందే ముందస్తు అరెస్టులు చేయడం సరి కాదని షేక్ బాబా అన్నారు,

# క్యాబినెట్ సమావేశంలో పీఆర్సీని ప్రకటించాలి

**టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు M.A.ఖాద్రీ**



**శంకరపట్నం జులై:16: పీపుల్స్ డైరీ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల, పెన్షనర్ల , ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీని తక్షణమే రేపు జరుగు క్యాబినెట్ సమావేశంలో ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఖాద్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు రోజు రోజుకు అగమ్యగోచరంగా మారుతున్నాయని పరిష్కరించాలని ఉద్యోగులందరూ సవినయంగా ముఖ్యమంత్రి గారిని విజ్ఞప్తి చేస్తున్నారు. మీరు చేయకపోతే మాకు గత్యంతరం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1-7-2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ 36 నెలలు, మూడు సంవత్సరాలు గడిచినా అతపతా లేకుండా పోయిందని, 36 నెలల గడుస్తున్నా అరణ్య రోదనేనని సర్వత్రా చర్చనీయాంశం అయితుందని అన్నారు. డీఏల బకాయిలు 6 కు చేరుకుంటుంది . హెల్త్ కార్డుల విషయంలో తొందరగా నిర్ణయం తీసుకొని జీతంలో నుంచి 1.5 % కోతలు పెట్టారని గుండెలు బాదుకుంటున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. ప్రభుత్వాలు మారినా ఉద్యోగుల తల రాతలు మారడం లేదని గ్రహణం పట్టినట్లైయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించి పీఆర్సీ అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగ విరమణ పొందిన రోజునే ఉద్యోగుల ప్రయోజనాలు కల్పించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు.

# రైతులకు అవగహన సదస్సు



**వీణవంక జులై 17( పీపుల్స్ డైరీ) :** మండలంలోని రామకృష్ణాపూర్, పోతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, మల్లన్నపల్లి వాల్బపూర్,మామిడాలపల్లి,దేశాయపల్లి , మల్లారెడ్డిపల్లి గ్రామాలలో ఏంఏఓ గణేష్, ఏఈఓలు గౌతమి, క్రీర్తన,లక్ష్మి ప్రసూన, తిరుపతి శ్రవణ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా కల్పించడం జరిగినది. ఎల్నినో ప్రభావం వలన వర్షభావ పరిస్థితులు నెలకొనడం వలన ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవలసిందిగా కోరారు.నీటి లభ్యత తక్కువగా ఉండటం వలన అరుతడి పంటలు మొక్కజొన్న, పెసర, కందులు, వేరుశెనగ, బొబ్బెరా, సజ్జలు వేసుకోవలసిందిగా వారు తెలిపారు.

# అద్భుత దేవాలయమే ధ్యేయం - మంత్రి సీతక్క

**ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష**



మంగపేట జులై 16 (పీపుల్స్ డైరీ)హేమాచల లక్ష్మి నృసింహస్వామి ఆలయాన్ని అద్భుత దేవాలయంగా తీర్చిదదిద్దడమే లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. గురువారం హేమాచలాన్ని కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, భగవాన్ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య లతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయంలో 3 కోట్లతో ముఖ మండపం, ఆర్చి, అన్నదానం సత్రంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 2027 జులై లో జరిగే గోదావరి పుష్కారాల వరకు మండల కేంద్రం లో పాత పుష్కరఘాట్ పునరుద్ధరణ తో పాటు మండల కేంద్రం అభివృద్ధి కి నిధులు కేటాయించానున్నట్లు తెలిపారు. మంగపేట భూర్గంపాడు రోడ్డు అభివృద్ధి కి 41 కోట్ల 69 లక్షలు, మంగపేట కోమటిపల్లి కాటాపూర్ వరకు 3 కోట్లు, పోషమ్మ ఆలయం వద్ద రెండు షెడ్లు, విద్యుత్, అభివృద్ధి పనులు కన్వర్షేషన్ తెలిపారు. జిల్లాలో టూరిజం అభివృద్ధికి రామప్ప, లక్నవరం, బొగత, హేమాచల క్షేత్రాలను అభివృద్ధి చేయడంతో పాటు మహిళా సంఘాలకు మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హామ్ ప్రోగ్రాం లో భాగంగా 50 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. కార్యక్రమం లో ఈఓ వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, అయ్యూరి యానయ్య, బుచ్చిరెడ్డి, టెంపుల్ కమిటీ చైర్మన్ యారంగరి సురేష్, మైల జయరాం రెడ్డి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఆక రాధకృష్ణ, పచ్చ శేషగిరి రావు, చింత పున్నారావు, సురేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే సమగ్ర భూ సర్వే

- భూ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**రేగొండ (గోరికొత్త పల్లి) జూలై 16 పీపుల్స్ డైరీ :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే సమగ్ర భూముల సర్వే నిర్వహిస్తున్నట్టు భూ సర్వేకు ప్రజలు సహకరించాలని భూపాలపల్లి ఎలా గండ్ర సత్యనారాయణ రావు,అన్నారు. గురువారం గోరికొత్తపల్లి మండలం గాంధీ నగర్,కొత్తపల్లి గోరి,జగ్గయ్య పేట గ్రామాల్లో నిర్వహించిన భూ సమగ్ర సర్వే గ్రామ సభలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాట్లాడుతూ, గ్రామాల్లో భూములు సాగు చేస్తున్న వారు ఒకరైతే, పట్టా పాస్ పుస్తకాలు మరొకరి పేరుపై ఉండటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమగ్ర భూ సర్వే తప్పనిసరిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు,రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలను సమన్వయం చేసుకొని పారదర్శకంగా భూ సర్వే నిర్వహించాలని సూచించారు. వాస్తవంగా భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించి, నిబంధనల ప్రకారం వారికి పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా రెవెన్యూ భూములు, గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు భూ సర్వే ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం కూడా ఈ సర్వే ద్వారా సులభతరం అవుతుందని తెలిపారు.రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అత్యంత ముఖ్యమని, పాస్ పుస్తకాలు ఉంటే పంట రుణాలు, రైతు భరోసా మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు. అర్హులైన రైతులకు భూ పట్టాలు, పాస్ పుస్తకాలు అందించే విషయంలో



అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఎన్నో ఏండ్లుగా గోరి కొత్తపల్లి, నిజాంపల్లి, గాంధీ నగర్, గ్రామాల్లో పట్టాలు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారనీ ఇప్పుడు నిర్వహించే భూ సర్వే ద్వారా పట్టాలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి- మంత్రి సీతక్క

**ఏటూరు నాగారం జూలై 16 (పీపుల్స్ డైరీ) :** మేడారం మహా జాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వచ్చే మేడారం మహా జాతర వరకు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా రోడ్డు విస్తరణ పనులపై అంచనానం తయారు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క సారలమ్మ దేవతలను కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా లతో కలిసి మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. మేడారం హరిత హోటల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, క్యూ లైన్లను ఆధునికీకరించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జంపన్న వాగు పరిసర ప్రాంతాలను సుందరీకరించాలని, ప్రధాన రహదారుల ఇరువైపులా డివైడర్ల మధ్య పచ్చదనాన్ని పెంపొందించేలా పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ఆలయ పరిసరాలతో పాటు మొత్తం మేడారం ప్రాంతాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, రహదారులపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకృతిని మనం రక్షిస్తే



ప్రకృతి మనలను రక్షిస్తుందనే భావనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని, పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిం చవచ్చన్నారు. కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ మేడారం అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిం చిన గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చెయ్యాలని దృఢ సంకల్పంతో ఉన్నామని, ముఖ్య మంత్రి పర్యటన నేపథ్యంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతల దర్శనం, జిల్లా అభివృద్ధి పైలాన్ ప్రారంభోత్సవం, నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి,సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,ఆర్ డి ఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు,ఆలయ పూజారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన వొడితల ప్రణవ్

**లిఅంబేద్కర్ భవనం, దళిత బంధు, సంక్షేమ పాఠశాలలకు నిధుల మంజూరు కోరుతూ విజ్ఞప్తి**



**హైదరాబాద్, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను కోరారు. హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రణవ్ బాబు, గత ప్రభుత్వ హయాంలో ప్రొసీడింగ్స్ జారీ చేసి అసంపూర్తిగా నిలిచిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్లు మంత్రి పేర్కొంటూ, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కూడా ప్రణవ్ బాబు మంత్రిని కోరారు. దీనిపై కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# వర్షాల కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**ఊరంతా వనభోజనాలకు..**



**రేగొండ జూలై 16 పీపుల్స్ డైరీ ..** వర్షం కోసం రైతన్న మొగలు వైపు చూస్తున్న వాన దేవుడు కరుణించడం లేదు కార్తులు ముగుస్తున్న ఒక్క వాన చినుకు కూడ నేల మీద పడటం లేదు రైతులు చాలా చోట్ల పత్తి విత్తనాలు,మిర్చి నారు, వరి మొలకలు వేసి వర్షం కోసం ఎదురు. చూస్తున్నారు.కానీ వరుణ దేవుడు కరుణించడం లేదు వర్షాలు పుష్కలంగా కురవాలని కోరుతూ రేగొండ మండలంలోని రూపిరెడ్డి పల్లి గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతల కు నీరు పోసి పసుపు కుంకుమలు చల్లి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామస్తులు అందరూ వనభోజనాలకు వెళ్లి గ్రామ శివారులో మైసమ్మ,తల్లికి బిందెలతో నీళ్ళు పోసి వర్షాలు కురవాలని వేడుకున్నారు.

# ఎమ్మెల్యే సత్తన్న..మా సమస్యను కూడా పరిష్కరించండన్నా..

## రాంనగర్ కాలనీ దళితులు



**చిట్యాల,జూలై 16 (పీపుల్స్ డైరీ) :** సీఎం ప్రజావాణి దరఖాస్తుకే మోక్షం లేదు అంటే ఇంకా ఎలా అని రైతులు వాపోతున్నారు. హైదరాబాదులోని సీఎం ప్రజావాణిలో దళిత రైతులు అర్జీ ఇచ్చి నేటికి రెండు సంవత్సరాలు గడిచిన ఈరోజు వరకు స్పందన లేదు. అట్టి సీఎం ప్రజావాణి అర్జీని చిట్యాల మండల రెవెన్యూ అధికారులు పక్కకు పెట్టారంటే ఈ మండల అధికారుల అలసత్వ పనితీరు ఏ విధంగా ఉందో అర్థం అవుతుంది. కోట్లాది రూపాయల విలువైన భూములకు సరిహద్దులు చూపించాలని దళిత రైతులు రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లి స్వయంగా ముఖ్యమంత్రి పేషీలో దరఖాస్తు ఇస్తే ఇప్పటికీ దాదాపు రెండు సంవత్సరాలు అయినా నేటి వరకు పట్టించుకోకపోవడం మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యపు పనితనానికి నిలువుటద్దంలా కనిపిస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రం శివారు వెంకటరావుపల్లి సి గ్రామంలోని 110 మంది దళితులకు సంబంధించిన ప్లాట్ల విషయంలో గత 21 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను ప్రస్తుత భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవ తీసుకొని అసెంబ్లీలో సైతం మాట్లాడి వారి సమస్యను పై అధికారులతో చర్చించి సమస్యకు గల కారణాలను తెలుసుకొని పరిష్కరించారు. ఈ సందర్భంగా 110 మంది దళితులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మా 106 మంది దళితుల భూ సమస్యను కూడా పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ దళితులు కోరుతున్నారు సార్...వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ దళిత రైతులు గతంలో ప్రభుత్వం తమకు మండలంలోని కైలాపూర్ శివారులో ఒక్కోరైతుకు ఇచ్చిన రెండు ఎకరాల భూములకు ప్రభుత్వ సర్వేయర్ల చేత సరిహద్దులు నిర్ణయించాలని హైదరాబాదులోని సీఎం ప్రజావాణి కార్యక్రమానికి రెండు సంవత్సరాల క్రితం వెళ్లి తమ భూ సమస్యపై ఫిర్యాదు చేసిన కూడా చిట్యాల మండల రెవిన్యూ భూపాలపల్లి జిల్లా రెవిన్యూ అధికారులు దాదాపు రెండు సంవత్సరాల నుండి పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే సీఎం ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తును పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో భూ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తమ సమస్యల పై విసిగిపోయిన రైతులు ప్రజలు గతంలో మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేసినా కూడా ఈ అధికారులకు చీమకుట్టినట్లు కూడా కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో భూములకు సంబంధించిన కొలతలు సరిహద్దుల సమస్యలు తదితర అనేక సమస్యలు పరిష్కరించాలని చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ దళిత రైతులు జిల్లా మండల రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ దశాబ్దాలుగా తిరిగి తిరిగి విసిగిపోయిన రైతులు ఆఖరికి హైదరాబాదులోని సీఎం ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లి ఫిర్యాదు చేసిన కూడా జిల్లా మండల అధికారుల్లో చలనం లేదు స్పందన ఆ మాత్రం కూడా కరువైపోయింది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో భూముల కొలతల సరిహద్దుల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ దళిత రైతులు మండల జిల్లా అధికారులకు తమ భూములను సర్వే చేసి ఎవ్వరి రెండెకరాల భూములను వారికి కేటాయించాలని గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా కూడా సంబంధిత రెవిన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రాంనగర్ కాలనీ దళిత రైతులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం.. రామ్ నగర్ కాలనీ చిట్యాల లోని దళిత రైతులకు గత 45 సంవత్సరాల క్రితం 106 మందికి తలా రెండు ఎకరాలు చొప్పున మొత్తం 212 ఎకరాల భూమిని మండలంలోని కైలాపూర్ శివారులో శాంతినగర్ సమీపంలో అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. పట్టాదారు పాసుబుక్కులు కూడా ఇచ్చింది. నేటి వరకు ఆ భూములను అందదా కొద్దీ సాగు చేసుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు.

ఆ సమయంలో ఆ రైతులకు తమ భూములకు సంబంధించిన సరిహద్దులు చూపించకపోవడంతో తాత్కాలికంగా అందాద కొద్దీ ఆ రైతులు రెండు ఎకరాలు చొప్పున ఆ భూములను సాగు చేసుకుంటూ నేటి వరకు పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రభుత్వ సర్వేయర్లచే సరియైన సరిహద్దులు చూపించాలని గత 20 సంవత్సరాలుగా దళిత రైతులు మండల రెవెన్యూ జిల్లా కలెక్టర్ ఆర్డిఓ ప్రభుత్వ సర్వేయర్ల చుట్టూ తిరుగుతూ దరఖాస్తులు ఇస్తు కొలతలకు సంబంధించిన ఎంసి ఫీజు చాలాన్స్ మీ సేవ సెంటర్లో చెల్లిస్తూ ప్రభుత్వ సర్వేయర్ల చుట్టూ తిరిగినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. గతంలో మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఒకే ఒక్క సర్వేయర్ ఉండడంతో ఒక్క సర్వేయర్ తో పని కాదు సర్వేయర్ల టీం రావాలని ఇట్టి విషయంపై సంబంధిత జిల్లా అధికారులకు తెలిపామని గతంలో పనిచేసిన తాసిల్దారులు చెబుతూ వస్తున్నారు. గత 20 సంవత్సరాల నుండి ప్రభుత్వ సర్వేయర్ల టీం వస్తుందని చెబుతున్నారు తప్ప సర్వేయర్ల టీం వచ్చింది లేదు దళితుల భూములకు సంబంధించిన కొలతలు సరిహద్దుల సమస్యలు పరిష్కారం అయ్యింది లేదు. నేటి వరకు వారి భూములకు సంబంధించిన సరిహద్దుల విషయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉంది. వ్యక్తిగతంగా వందలాది మంది రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులు ఇచ్చినా కూడా ప్రభుత్వానికి చాలాన్ ఫీజు కట్టినా కూడా ఆ భూముల సమస్యలు అలాగే ఉంటున్నాయి. పరిష్కారం మాత్రం కావడం లేదు. మండలంలో ప్రస్తుతానికి ఒక్కడే సర్వేయర్ ఉన్నారు. సర్వేయర్ మండలంలో గతంలో నుండి పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించిన దాఖలాలు ఎక్కడా లేవని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. మండలంలో భూభారతి తో సంబంధంలేని వందల కొద్ది భూ సమస్యలు కోకోలుగా ఉన్నాయి. కొన్ని సమస్యలు కోర్టు పరిధిలో ఉండొచ్చు కానీ కోర్టుతో సంబంధం లేని అనేక సమస్యలు అధికారులు ప్రత్యక్షంగా సర్వే జరిపి విచారణ చేసి పరిష్కరించాల్సి ఉండగా అవేమి కూడా ఈ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు రైతులు ఆరోపిస్తున్నారు. చివరికి విసిగి వేసారి పోయిన రాంనగర్ కాలనీ రైతులు 2024 ఆగస్టు నెలలో హైదరాబాదు లోని సీఎం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లి తమ భూములకు సరిహద్దులు ప్రభుత్వ సర్వేయర్లచే నిర్ణయించాలని కొలిపించాలని దరఖాస్తు ఇవ్వగా అట్టి సమస్యను పరిష్కరించాలని ప్రస్తుత జిల్లా కలెక్టర్ చిట్యాల తాసిల్దార్ కార్యాలయానికి ఆదేశాలు ఇవ్వగా ఉన్నగానొక్క ప్రభుత్వ సర్వేయర్ ఆ సమయంలో చిన్న కాలేశ్వరం భూముల సర్వే కోసం డిప్యుటేషన్ మీద వెళ్ళాడని ఆయన వచ్చాక ఆయనతో పాటు సర్వేయర్ల టీంను పంపించి తమ భూములను సర్వే చేపిస్తామని అప్పటి తాసిల్దార్ హామీ ఇవ్వడం జరిగిందని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తెలుపుతున్నారు. అప్పటి ఎమ్మెల్యేకు కూడా ఈ దళిత రైతులు దరఖాస్తు లిచ్చి సమస్యను పరిష్కరించాలని కోరినా కూడా ఆ సమస్య పరిష్కారానికి నోచుకోకుండా ఇప్పటివరకు అలాగే ఉంది. మండల రెవెన్యూ అధికారులు మాటలు మాత్రమే చెబుతూ చేతలు చేయడం లేదని తమ భూములకు సరిహద్దులు నిర్ణయించకుండా నిర్లక్ష్యంగా ప్రభుత్వ సర్వేయర్లు అధికారులు వ్యవహరిస్తున్నారని దళితులు దుఃఖపూరితంగా ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నారు. తమ తాతలు తండ్రులు కొడుకులు తమ తరాలు పోతున్న కూడా తమ భూములకు సరిహద్దులు నిర్ణయించడంలో అధికారులు పట్టించుకోకుండా ఉండడం వెనుక తాము దళితులం కాబట్టే ఇంత నిర్లక్ష్యమా అని దళితులు ఆరోపణలు చేస్తు ఆదవేదన వ్యక్తం చేస్తూ చెబుతున్నారు. అధికారుల చుట్టూ ప్రభుత్వ సర్వేయర్ల చుట్టూ ఏళ్ల తరబడి తిరగ్గా గతంలోని ఒక ప్రభుత్వ సర్వేయర్ దళితుల భూముల మోకా మీదికి వచ్చి కొంతవరకు సర్వే జరిపి మధ్యలోనే ఆపి బదిలీపై వెళ్లారు. దాంతో దళితుల భూముల కథ మళ్లీ మొదటి కొచ్చింది. విసిగిపోయిన దళిత రైతులు ప్రస్తుత జిల్లా కలెక్టర్ ను కూడా కలిసి తమ భూ సమస్యను తెలపడంతో ప్రభుత్వ సర్వేయర్లచే సరిహద్దులు చూపించి ఎవరి రెండెకరాల భూమి వారికి కేటాయిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆనంద పడ్డారు. కానీ నేటి వరకు అది జరగలేదు. హైదరాబాదులోని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రజావాణి అధికారులు ఆదేశించిన కూడా దళితుల భూములకు సరిహద్దులు అధికారులు నిర్ణయించకపోవడంతో దళిత రైతులు పలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తరాలు పోతున్న కూడా తమ భూముల సరిహద్దుల సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రతి సంవత్సరం సాగు సమయంలో రైతులు హద్దుల విషయంలో నేటి వరకు గొడవలు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులు స్పందించి మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ దళిత రైతులకు మండలంలోని కైలాపూర్ శివారు నందుగల భూములకు ప్రభుత్వ సర్వేయర్లచే సరిహద్దులు నిర్ణయించి వారి రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపాలని రామ్ నగర్ కాలనీ దళిత రైతులు కోరుతున్నారు.

# డోర్నకల్--భద్రాచలం రైల్వే డబ్లింగ్ భూ నిర్వాసితుల సమస్యపై సంయుక్త విచారణ



**సింగరేణి కారేపల్లి జూలై 16 (పీపుల్స్ డైరీ):** సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో డోర్నకల్--భద్రాచలం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన భూ నిర్వాసితుల భూములను పరిశీలించేందుకు గౌరవ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎమ్మార్వో, ఆర్ఐ, జీపీఓ, అటవీ శాఖకు చెందిన ఎఫ్ఆర్ఓ, డీఆర్ఓ, ఎఫ్‌బీఓ, రైల్వే శాఖకు చెందిన డీఈ, జేఈ అధికారులు గ్రామాన్ని సందర్శించి సంయుక్త విచారణ నిర్వహించారు. ఈ విచారణలో గాదెపాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, భూ నిర్వాసిత రైతులు, ఒడ్డుగూడెం, చర్లపల్లి, గాదెపాడు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విచారణ సందర్భంగా 67వ సర్వే నంబరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సంబంధిత భూమి హద్దులను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరవ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత రికార్డులను పూర్తిగా పరిశీలించి, అటవీ శాఖతో సమన్వయం చేసుకుని నిబంధనల ప్రకారం సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని భూ నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు కూడా రికార్డుల ఆధారంగా, నిబంధనల ప్రకారం రైల్వే శాఖకు భూమి బదిలీ, పరిహారం తదితర అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు పై అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ, భూ నిర్వాసిత రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఈ సమస్యను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



**హుస్నాబాద్: టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 16 :** స్నేహం అంటే సంతోషంలోనే కాదు, కష్టకాలంలోనూ అండగా నిలవడమేనని హుస్నాబాద్ జడ్పీ హైస్కూల్ 2003--04 పదో తరగతి మిత్రబృందం చాటిచెప్పింది. అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన లింగాల బాబు తండ్రి లింగాల గట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మిత్రబృందం వారి కుటుంబాన్ని పరామర్శించింది. అనంతరం లింగాల బాబు కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.14,500 నగదు ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన మిత్రులు, అవసర సమయంలో ఒకరికొకరు తోడుగా ఉండటమే నిజమైన స్నేహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జడ్పీ హైస్కూల్ 2003--04 పదో తరగతి మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

# దేవాదుల నార్త్ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేయాలి

## కలెక్టర్‌కు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం



**భీమదేవరపల్లి జూలై 16 (పీపుల్స్ డైరీ ) :** హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ నార్త్ దేవాదుల కాలువ ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకోవడానికి దేవాదుల కాలువ నీరే ఏకైక మార్గమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి, తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్యను అర్థం చేసుకున్న వెంటనే నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులకు అవసరమైన సాగునీటిని త్వరితగతిన విడుదల చేసే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ త్వరితగతిన స్పందించడం పట్ల రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి, ముప్పు శ్రీనివాస్,కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- **ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ పథకాలు కల్పించాలి: మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్**
- **ఉద్యమకారుల కమిటీకి వినతిపత్రం సమర్పణ**



**హైదరాబాద్, జూలై 15 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక దీపం కేంద్రంలో కరీంనగర్, మంచిర్యాల జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, శోభన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఉద్యమంలో తన పాత్రకు సంబంధించిన నివేదికను కమిటీకి అందజేశారు.

### ఉద్యమకారులకు సంక్షేమం కల్పించాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని, నెలకు రూ.25 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు, ఇంటి నిర్మాణానికి 250 గజాల ప్రభుత్వ స్థలం, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు.


### ఉచిత బస్సు ప్రయాణం- కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యమకారులకు గౌరవప్రదమైన సేవలు అందించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉద్యమకారులు మరియు వారి కుటుంబ సభ్యులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల కమిషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌తో పాటు సభ్యులను వెంటనే నియమించాలని కోరారు.

### ముఖ్యమంత్రికి అభినందనలు

తెలంగాణ ఉద్యమకారుల కమిటీని ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, మహమ్మద్ హబీబ్, మిర్జా ఇమ్రాన్ బేగ్, ఏ. సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల ఘన సన్మానం



**భీమదేవరపల్లి, జూలై 16(పీపుల్స్ డైరీ ):** కాకతీయ యూనివర్సిటీ డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ నూతన జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన పుల్ల. శ్రీనివాస్ ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగతో కలిసి హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ మాట్ల వెంకటస్వామి, భీమదేవరపల్లి మండల ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు నూతన జాయింట్ డైరెక్టర్‌ను కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల. వెంకటస్వామి మాదిగ, మండల నాయకులు వేల్పుల. ప్రశాంత్ తదితరులు నూతన జాయింట్ డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ... విద్యా రంగంలోనూ, సమాజంలో అంబేద్కర్ ఆశయాల సాధనలోనూ నూతన జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని, విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఆళ్లపల్లిలో సర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు



**ఆళ్లపల్లి జూలై 16 : (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని ముత్తాపురం, అనంతోగు, రాయపాడు ఆళ్లపల్లి గ్రామాల్లోని నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మండల బిఆర్ఎస్ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ లను కలసి కార్యక్రమం అమలుపై వివరాలు తెలుసుకొని పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి అర్హత కలిగిన ఓటర్కి సర్ ఫారాలు తప్పనిసరిగా అందేలా చూడాలని ఫారం నింపడంలో అవగాహన లేని వారికి బి ఎల్ వో లు ప్రత్యేకించి సహాయం చేయాలని సూచించారు. ప్రతి ఓటర్ సరఫరాన్ని పూర్తిచేసి బి ఎల్ ఓ లకు అందజేయాలని లేని పక్షంలో ఓటు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్ ప్రోగ్రాం ఇంచార్జ్ మాజీ గ్రంథాలయ చైర్మన్ దీండిగల రాజేందర్ ఉపసర్పంచులు నాగేష్ ఆరిఫ్ రఘుపతి గిరి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి నాయకులు నరసింహారావు బాబా వెంకటేశ్వర్లు కిషోర్ బాబు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలో పైపుల అపహరణ



**శంకరపట్నం జులై:16: పీపుల్స్ డైరీ :** మండల పరిధిలోని వంకాయగూడెం గ్రామంలోని ప్రభుత్వ నర్సరీలో వాచర్‌గా పనిచేస్తున్న బత్తుల కొమురయ్య బుధవారం సాయంత్రం యథావిధిగా చెట్లకు నీళ్లు పట్టి ఇంటికి వెళ్లారు. మళ్లీ గురువారం తెల్లవారుజామున చెట్లకు నీళ్లు పట్టేందుకు వచ్చేసరికి, రాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు నర్సరీలోని నీటి పైపులను దొంగిలించినట్లు ఆయన గుర్తించారు. దొంగిలించిన పైపుల విలువ దాదాపు రూ. 3,000 ఉంటుందని బాధితుడు తెలిపారు.

# ఆరుతడి పంటల సాగుతోనే రైతులకు లాభం-ఏఈఓ సునంద



**శంకరపట్నం జులై :16: పీపుల్స్ డైరీ :** రానున్న వానకాలం సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందువల్ల రైతులు పంటల ఎంపికలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ సునంద సూచించారు. గురువారం శంకరపట్నం మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన పెసర, మినుము, వేరుశనగ, కంది, మక్కజొన్న సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. దీనివల్ల పెట్టుబడి నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. భూగర్భ జలాలు, తగినంత నీటి సదుపాయం ఉన్న రైతులు మాత్రమే వరి సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు . ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చింతి రెడ్డి పద్మ గ్రామ రైతులు అందరు పాల్గొన్నారు.

# జగన్నాథ రథ యాత్రను ప్రారంభించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 16 :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో గురువారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ రథయాత్ర సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై, పట్టణ పురవీధుల గుండా పీఎస్ఆర్ గార్డెన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డి పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తి పాటలు పాడుతూ భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇస్కాన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

# మహిళా సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**



**భూపాలపల్లి జూలై 16 పీపుల్స్ డైరీ..**మహిళా సంఘాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార, పశు సంవర్ధక, మున్సిపల్, పంచాయతీ శాఖ, మెప్మా, సెర్ప్ అధికారులు, కోఆర్డినేటర్లు, ఏపీఎంలతో జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు స్త్రీ నిధి రుణాల వల్ల కలిగే ప్రయోజనాలు, మన స్త్రీ నిధి యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా మహిళలకు వివిధ ఉపాధి అవకాశాల కోసం రుణాలు అందిస్తోందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి స్త్రీ నిధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్త్రీ నిధి రుణాల మంజూరులో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. అయితే మహాముత్తారం, పలిమెల మండలాల్లో రుణాల వినియోగదారులు తక్కువగా ఉన్నారని, ఆ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన మహిళలకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ రికవరీలను త్వరితగతిన పూర్తి చేసి కొత్త రుణాల మంజూరుకు అవకాశం కల్పించాలని అన్నారు. రుణాల రికవరీలో జిల్లా ప్రస్తుతం 19వ స్థానంలో ఉందని, ఈ ర్యాంకును మెరుగుపర్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఘన్పూర్, టేకుమట్ల మండలాలలో నిధులు దుర్వినియోగం చేసిన వీఓఏ లపై చర్యలు తీసుకోవాలని నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. కాటారం మండలంలో స్త్రీ నిధి రుణాల సహాయంతో మహిళలు కుట్టు మిషన్ల ద్వారా పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టి అందిస్తున్నారని ప్రశంసించారు. అలాగే జిల్లాలోని మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, సహకార అధికారి వాల్యా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మెప్మా పిడి రాజేశ్వరి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, సెర్ప్, మెప్మా అధికారులు ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా సీఎం సహాయనిధి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**

**వెన్నంపల్లిలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



**సైదాపూర్ జులై 16 ( పీపుల్స్ డైరీ ) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా మారిందని స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ, సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం వెన్నంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు వారు అందజేశారు. గ్రామానికి చెందిన సంగాల వినయ్ కుమార్‌కు రూ. 1,08,000, అలాగే సారబుడ్ల శ్రీమతమ్మకు రూ. 12,000 చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు స్థానిక బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సంగాల వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమను ఆదుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ఇందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సైదాపూర్ ఏఎంసీ ఛైర్మన్డ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంత సుధాకర్ కు వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో ఛైర్మన్ సారబుడ్ల రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పరకాల రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మారుపాక తిరుపతి, సీనియర్ నాయకులు అబ్బిడి కొండాల్ రెడ్డి, ఒంటెల లింగారెడ్డి, బండ శివానంద రెడ్డి, 6వ వార్డు సభ్యుడు సారబుడ్ల లింగారెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సంగాల రమేష్, నాయకులు సంగాల మహేష్, మారుపాక సుమన్, మారుపాక ప్రణయ్, బీస నర్సయ్య, చిట్టుమల్ల నరేష్, చిట్టుమల్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

# చింతలపల్లి వద్ద ఘోర ప్రమాదం-ఆటో ట్రాలీ, బైక్ ఢీకొని యువకుడి మృతి

- కళ్లెదుటే భర్త దుర్మరణం.. గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి
- మృతుడు రాంచంద్రాపూర్ వాసి కొయ్యడ మధు
- మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఆసుపత్రికి కూతురు.. భార్యకు స్వల్ప గాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కొప్పుల స్వాతి



**సైదాపూర్ జులై 16 ( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాములపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని చింతలపల్లి గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనలో ఆరేళ్ల చిన్నారికి తీవ్రగాయాలు కాగా, భార్య గాయాలతో బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ మధు (28) బుధవారం రాత్రి సుమారు 9:05 గంటల సమయంలో తన భార్య, ఆరేళ్ల కూతురితో కలిసి ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వెళ్తున్నాడు. వీరు చింతలపల్లి స్టేజ్ వద్దకు చేరుకోగానే, ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆటో ట్రాలీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మధు రక్తపు మడుగులో కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా మధు ఆరేళ్ల కుమార్తెకు తీవ్ర గాయాలు కాగా, మెరుగైన చికిత్స కోసం వెంటనే వరంగల్‌కు తరలించారు. మధు భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. కళ్లెదుటే భర్త విగతజీవిగా పడిఉండటాన్ని చూసి ఆమె కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రూరల్ సీఐ శ్రీనివాస్, సైదాపూర్ ఎస్ఐ కప్పుల స్వాతి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న చిన్నారి ఆసుపత్రి పాలు కావడం, కుటుంబ పెద్ద దిక్కు మృత్యువాత పడటంతో రాంచంద్రాపూర్ లో తీవ్ర విషాదచ్ఛాయలు అలుముకున్నాయి.

# విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్మెన్ అందరికీ ఆదర్శంగా నిలిచాడు

- విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్మెన్ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.



**జమ్మికుంట జులై 16పీపుల్స్ డైరీ :** కూలి నాలీ చేసుకునే బీద ప్రజలు సైతం తమ పిల్లలను ఈ కాలంలో ప్రయివేట్ పాఠశాలకు పంపడానికి మొగ్గు చూపుతున్నారు. కాస్త ఆదాయం ఉన్నవారు అయితే పేరున్న పాఠశాలలో వేలకు వేలు ఫీజులు కట్టి బడికి పంపుతున్నారు. ఇంక ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఏకంగా సంవత్సరానికి రెండు లక్షల ఫీజు తీసుకునే ఇంటర్నేషనల్ స్కూళ్లలో చదివిస్తున్నారు. కానీ వీరి ఆలోచనలకు భిన్నంగా విద్యుత్ శాఖ లో పనిచేసే ఓ అసిస్టెంట్ లైన్ మెన్ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపి అందరికి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన బాకీ సతీష్ కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నాగంపేటలో ఏఎల్ఎం గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు సంతానం. గత ఏడాది తన కూతురు అద్వికా మహాశ్రీ ని ఓ ప్రయివేట్ పాఠశాలకు పంపాడు. అయితే పాప వయస్సుకు మించి పుస్తకాల బరువు ఉందని, తన బాల్యం మొత్తం పుస్తకాల మధ్యలోనే గడిచిపోతుందని భయపడ్డారు. ఈ సంవత్సరం తన రెండో సంతానం అయిన అబ్బాయిని కూడా పాఠశాలకు పంపే వయస్సు రావడంతో ఆయన ఆలోచనల్లో పడ్డారు. తన చిన్ననాటి సంగతులను ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నాడు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తాను కష్టపడి విద్యుత్ శాఖలో ఉద్యోగం సంపాదించానని, ఇప్పుడు కూడా వారిని అందులో జాయిన్ చేస్తే తప్పేంటని ఆలోచించారు. తన ఇద్దరు పిల్లలను నాగంపేట్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేయించాడు. పిల్లలిద్దరిని స్కూల్ అడ్మిషన్ చేయించడానికి ప్రధానోపాధ్యాయురాలు పి. ప్రవీణ, స్కూల్ అసిస్టెంట్ బి. తిరుపతి కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా నాణ్యమైన విద్య దొరుకుందని, పిల్లలను వయస్సు మించి చదువు చెబుతున్న పాఠశాలలకు పంపవద్దని ఈ సందర్భంగా బాకీ సతీష్ చెప్పారు. ఉపాధ్యాయులపై తనకు పూర్తి నమ్మకం ఉందని, కచ్చితంగా తన పిల్లలు ప్రయోజకులు అవుతారని ఆయన నమ్మకంగా చెబుతున్నారు. సతీష్ చేసిన పని ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షించింది.

# శోభాయమానంగా జగన్నాథుని రథయాత్ర-వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**పటాన్‌చెరు, జూలై 16 :**ఇస్నాపూర్‌లోని శ్రీ జగన్నాథ స్వామి దేవాలయంలో గురువారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి నామస్మరణతో ఇస్నాపూర్ ప్రాంతమంతా మారుమోగగా, వేలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథయాత్రను విజయవంతం చేశారు. జగన్నాథ స్వామివారి రథాన్ని భక్తులు జై జగన్నాథ్ నినాదాల మధ్య భక్తిపూర్వకంగా లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు దేవాలయానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు తాగునీరు, వైద్య సదుపాయాలు, క్యూలైన్లు తదితర ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం నుంచి జాతీయ రహదారి వరకు సాగిన రథయాత్ర భక్తి పారవశ్యంతో శోభాయమానంగా కొనసాగి, అనంతరం తిరిగి దేవాలయానికి చేరుకోవడంతో ముగిసింది. రథయాత్ర సందర్భంగా పటాన్‌చెరు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.



# అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డుల తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్

## నెల రోజుల పాటు విస్తృత స్థాయిలో చర్యలు - నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు : కమిషనర్ వెంకన్న

**మట్టెవాడ, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) డిఆర్ఎఫ్ బృందాలు ఏసీపీల నేతృత్వంలో గురువారం నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్, హన్మకొండ మిషన్ హాస్పిటల్, సర్క్యూట్ గెస్ట్ హౌస్ తదితర ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులు, ప్రచార బోర్డులను తొలగించాయి. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ నగర సౌందర్యానికి భంగం కలిగించే విధంగా ఎవరూ విచ్చలవిడిగా ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో వారం రోజుల వ్యవధిలో నగరంలోని అన్ని అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రెండో విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, గోడలపై అనుమతి లేకుండా రాసిన వాల్ రైటింగ్స్, పోస్టర్లు, పెయింటింగ్‌లను పూర్తిగా తొలగించి, వాటిస్థానంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించే ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్‌లు రూపొందించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నగరంలో ఉన్న అన్ని అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆయన కోరారు. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు లేదా ఇతర సంస్థలు మున్సిపల్ అనుమతి లేకుండా ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రచార బోర్డులు





ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, విద్యుత్ స్తంభాలు, సెంట్రల్ డివైడర్లు, రహదారి కూడళ్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రయాణికుల ప్రాంగణాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా గోడపత్రికలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు, బ్యా నర్లు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధించబడిందని కమిషనర్ తెలిపారు. స్వచ్ఛమైన, సుందరమైన, క్రమబద్ధమైన గ్రేటర్ వరంగల్ నిర్మాణమే జీడబ్ల్యూఎంసీ లక్ష్యమని, నగర సౌందర్యాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని వెంకన్న అన్నారు. ప్రజలందరూ మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ టి.వెంకన్న కోరారు.



## 200 కుటుంబాలకు ఉచిత రేషన్ పంపిణీ

**మట్టెవాడ, జూలై 16 (పీపుల్స్ డైరీ):** రెక్సులర్ వెల్ఫేర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ పోచమ్మ దేవాలయం దగ్గర అన్నపూర్ణ యోజన పథకం కింద 200 కుటుంబాలకు గురువారం ఉచిత రేషన్ పంపిణీ చేశారు. చిమ్మని లత అధ్యక్షతన జరిగిన ఈ ఉచిత రేషన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ పసునూరి దయాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా తెలంగాణ ఇన్చార్జి గడ్డి అశోక్, ఎంఎస్ రాజు, మెరుగు సురేందర్, గజ్జి భాస్కర్, మచ్చ నాగరాజు, చిప్ప భాగ్యలక్ష్మిలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఆదివాసులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



**నూగురు వెంకటాపురం, జూలై 16(పీపుల్స్ డైరీ) :** ఆదివాసులపై అటవీ శాఖ అధికారులు అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద నిర్వహించిన అత్యవసర ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసిలు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అటవీ అధికారులు ఆదివాసులను బెదిరించడం, పంటలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులైన ఆదివాసులందరికీ వెంటనే పోడు భూములపై హక్కుల పత్రాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదివాసుల సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు, నాయకులు తుర్స ప్రశాంత్, సోడి గోపి తదితరులు పాల్గొన్నారు.

## మాదన్నపేట ప్రజల తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు



**నర్సంపేట, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేటలోని రెండు నల్లాల బావులు పూర్తిగా అడుగంటడంతో 1వ వార్డు ప్రజలు తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాదన్నపేట చెరువు నుండి 3 రోజులుగా సుమారు 400 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేసి, గురువారం రోజు ఉదయం నుంచే మున్సిపల్ సిబ్బంది నిర్విరామంగా శ్రమించి నల్లాల బావులకు నీటిని అందించారు. దీంతో 1వ వార్డు ప్రజల తాగునీటి కొరత ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి, నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మి రామానంద్ కి, సహకరించిన వాటర్ కమిటీ పొన్నం నరసింహ రెడ్డి, శ్రీరామోజు రోజారాణి, కంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, ఇస్లావత్ రమ గోపి కౌన్సిలర్‌లకు, మున్సిపల్ కమిషనర్‌కి, మున్సిపల్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో కొత్తకొండ మేఘన శ్యామ్‌రాజ్ కౌన్సిలర్, 1వ వార్డు, తదితరులు ఉన్నారు.



## అర్వణపల్లిలో గుర్తు తెలియని దుండగుల కుట్ర

### 3 ఎకరాల గడ్డి దగ్ధం... రైతు లక్షల నష్టం

**కేసముద్రం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** అర్వణపల్లి గ్రామానికి చెందిన రైతు నలమాస రాములుకి చెందిన 3 ఎకరాల్లో ఉన్న గడ్డిని గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. ఇంటి దగ్గర నిల్వ ఉంచిన గడ్డి కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే 3 ఎకరాల గడ్డి పూర్తిగా బూడిద అయింది. ఈ ఘటనతో రైతు నలమాస రాములు లక్షల రూపాయల నష్టపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు రాబోయే సీజన్ వరకు ఉపయోగపడే గడ్డిని కావాలని కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఫిర్యాదు చేస్తామని రైతు కుటుంబం తెలిపింది. రైతు కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందించాలని కోరారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



**గోవిందరావుపేట, జూలై 16(పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలక్నవరం సరస్సులో గురువారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం కావడంతో కలకలం రేపిం ది. స్థానికులు బుస్సాపూర్ గ్రామస్తులు పసర పోలీసులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు సంఘట న స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 నుండి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గుర్తు తెలియని వృద్ధుడి వివరాలు తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు వివరించారు,

## నర్సంపేటలో ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్



**నర్సంపేట, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా. సత్యశారద గురువారం నర్సంపేట పట్టణం లోని వల్లభ్‌నగర్, సాయినగర్ కాలనీ 149,156,159 పోలింగ్ కేంద్రాల పరిధి లో పర్యటించి బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యు మరేషన్ ఫారాల పంపిణీ పూర్తి అయిన ఓటర్ల వివరాల నమోదు పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి బీఎల్‌ఓల పని తీరుపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారంలో వివరాలను పరిశీలించి చూడాలని, ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని బీఎల్‌ఓలు, పర్యవేక్షణ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. పరిశీలనలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి తాసిల్దార్ హరిచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రజా ప్రతినిధిపై దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



**నర్సంపేట, జూలై 16(పీపుల్స్ డైరీ) :** గిరిజన ప్రజా ప్రతినిధి 16వ వార్డు కౌన్సిలర్ భానోత్ నవీన్ నాయక్ పైన మట్టి మాఫియా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దాడికి గురి అయిన 16వ వార్డు కౌన్సిలర్ భానోత్ నవీన్ నాయక్‌ని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి మాఫియా చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు సహకరిస్తున్న పోలీసులు అధికారులు....నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి మాఫియా పెంచి పోషిస్తున్న స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జరుగుతున్న దాడులకు బాధ్యత వహించాలి...దాడులు చేస్తున్న మట్టి మాఫియా పైన కొత్తగా వరంగల్‌కి వచ్చిన నూతన సిపి శ్వేత రెడ్డి దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధికారులను పోలీసులు ఉపయోగించి కాంగ్రెస్ నాయకులు మట్టి మాఫియా నడిపిస్తూ ప్రజలను రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## అన్నప్రసాదానికి ఆర్థిక చేయూత

### అభినందనలు తెలిపిన సాయిబాబా ఆలయ కమిటీ



**నూగురు వెంజటాపురం, జులై 16(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ సాయిబాబా మందిరం వద్ద ప్రతి గురువారం భక్తుల సహకారంతో నిర్వహించే అన్న ప్రసాద కార్యక్రమానికి దాతలు 45 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. కర్నూలు జిల్లా వాసి జిల్లా అశోకు జన్మదినాన్ని పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు అరుణ నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో, ప్రముఖ వ్యాపారులు నెల్లూరి రమేష్ బాబు, వెంకట్ రెడ్డి, రంగారావు, రాయల రవికుమార్, కందుల వెంకటేష్ లు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి వారం భక్తుల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులతో పాటు పుర ప్రముఖులు వ్యాపారస్తులు ఆర్థికంగా సహాయం అందించడం ఆనందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీతో పాటు సాయిబాబా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కపాలినీ మాతగా భద్రకాళి మాత...

**మట్టెవాడ, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు గురువారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట దీక్షా హటరీమం జరిపి చతుస్థానార్చన పూర్తిచేసిన అనంతరం తిథి మండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి షడ్వైరాలలో జ్ఞానశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి కపాలినీ మాత గాను క్రియాశక్తిని షోడశ్రీ క్రమాన్ని అనుసరించి భగమాలినీ మాత గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. కపాలినీ మాత సృష్టిని అసురీ శక్తుల విధ్వంసం నుండి కాపాడుతుంది. పైశాచిక శక్తులను సంహరించి అసురీ శక్తులపై దైవీ శక్తుల విజయ సంకేతంగా రాక్షసుల కపాలాలను మాలగా ధరిస్తుంది. భగమాలినీ మాతను బ్రాహ్మీ శక్తి అని కూడా అంటారు. ఈ భగమాలినీ మాతను ఉపాసించడం వల్ల సత్సంతాన సౌభాగ్యాలు కలుగుతాయి. అంతేగాక విదియ తిథికి ఆది దేవతయైన బ్రహ్మ ఉపాసన కూడా జరపబడింది. బ్రహ్మ యజనం కూడా జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో రామల సునీత పర్యవేక్షించారు.

# మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్ గౌడ్

## నియామక పత్రాన్ని విడుదల చేసిన మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్





**నర్సంపేట, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ గా నియమిస్తూ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ గురువారం నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈనెల 12న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో కందుల శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తున్నట్లు జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్‌తో కలిసి ప్రకటన చేసిన నర్సాగౌడ్ కందుల శ్రీనివాస్ గౌడ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోకుదెబ్బ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా బాధ్యత వహించాలని నర్సాగౌడ్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సిద్ధాంతాలు, కార్యక్రమా లు, గౌడ్ సమాజ హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, సంస్థకు బలమైన డిజిటల్ వేదికను నిర్మించడం లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నరసింహులు గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దెల సాంబయ్య గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు గోడిశాల మల్లయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

# గణపసముద్రంను గోదావరి జలాలతో నింపాలి..!

## రామప్ప గణపసముద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**గణపురం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** కనీస నీటిమట్టం కూడా లేక వెలవెలబోతున్న చారిత్రక గణపసముద్రాన్ని గోదావరి జలాలతో తక్షణమే నింపాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గణపసముద్రం చెరువు, రామప్ప చెరువు నుంచి గణపురం చెరువుకు నిర్మించిన గ్రావిటీ కెనాల్, రామప్ప--పాకాల పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణపసముద్రం కేవలం ఒక చెరువు కాదని, ఐదు మండలాల ప్రజల తాగునీటి అవసరాలు, వేలాది ఎకరాల సాగుభూములకు జీవనాధారంగా నిలిచిన జలాశయమని పేర్కొన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చారిత్రక చెరువు నీటితో గణపురం మాత్రమే కాకుండా భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్లతో పాటు మోరంచ వాగు పరిధిలోని అనేక గ్రామాల రైతులు రెండు పంటలు సాగు చేసుకునే పరిస్థితి ఉంటుందని తెలిపారు. చెరువు నిండుగా ఉంటే భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీరు అందుబాటులోకి వస్తుందని, గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తీరుతుందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని, ఈ పరిస్థితి ముందుగానే వస్తుందని అంచనా వేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రామప్ప చెరువు నుంచి గణపసముద్రానికి గ్రావిటీ కెనాల్ నిర్మించారని గుర్తు చేశారు. ఈ కెనాల్ లక్ష్యం వర్షాలపై ఆధారపడకుండా అవసరమైన సమయంలో గోదావరి జలాలను గణపసముద్రానికి తరలించి చెరువును నింపడమేనని పేర్కొన్నారు. అంతేకాకుండా గణపసముద్రం ఆధారంగానే ఆరు మండలాల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ఇలాంటి కీలకమైన జలాశయాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. రెండు రోజులుగా దేవాదుల నుంచి రామప్ప చెరువుకు నీటిని ఎత్తిపోస్తున్న నేపథ్యంలో అక్కడ పూర్తి నీటిమట్టాన్ని కొనసాగిస్తూ, వెంటనే గ్రావిటీ కెనాల్ ద్వారా గణపసముద్రానికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో చెరువులో పూర్తి నీటిమట్టం కొనసాగి తాగునీటి, సాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్య ధోరణి కారణంగానే నేడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గండ్ర ఆరోపించారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైన సమయంలో రైతులకు నీటి భరోసా కల్పించాల్సిన పాలకులు చేతులు ముడుచుకుని కూర్చోవడం బాధాకరమన్నారు. గణపసముద్రం ఎండిపోతే రైతులే కాకుండా తాగునీటిపై ఆధారపడిన లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పోలసాని లక్ష్మీ నరసింహ రావు, మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్‌రావు, మాజీ ఎంపీటీసీలు మందు అశోక్ రెడ్డి, దాసరి రవి, కేటీఆర్ సేన నాయకులు మీసం భరత్ రెడ్డి, పిన్నింటి మణిదీప్ రావు, బిఆర్ఎస్ నాయకులు అయిలేని రామచంద్రారెడ్డి, నాయకులు దాసరి రవి, మోకిరాల తిరుపతిరావు, మంద అశోక్ రెడ్డి, పిన్నింటి శ్రీనివాస్ రావు, కొడారి ధనుంజయ్, గజర్ల చింటూ, హాఫీస్, వాజిత్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వరమ్మకు తక్షణమే క్షమాపణలు చెప్పాలి

**జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**



**చిట్యాల, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** బీసీ మహిళను కించపరిచే విధంగా మాట్లాడిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన గురువారం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 18 మంది సభ్యులతో కూడిన నూతన పాలక మండలి ట్రస్ట్‌బోర్డ్‌ను ఏర్పాటు చేసిందని అందులో ఒక బీసీ మహిళ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను నియామకం చేస్తే అగ్రవర్ణ నాయకులు సహించలేక బూతు పదజాలంతో తల్లి లాంటి ఈశ్వరమ్మను తిట్టడం జరిగిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కడి శివ చరణ్ రెడ్డి వెంటనే మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీరు రాజకీయాలలో ఎదగాలంటే కష్టపడి ఎదగండి కానీ ఒక బీసీ మహిళను ఇష్టం వచ్చినట్లుగా తిడితే ఎదుగుతాననుకోవడం మూర్ఖత్వమన్నారు. ఒక యువజన సంఘంలో పనిచేస్తూ ఇలాంటి మాటలు మాట్లాడడం సిగ్గుచేటుగా భావిస్తున్నామన్నారు. మీరు మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని ఈశ్వరమ్మ యాదవ్‌కి క్షమాపణలు చెప్పాలని లేకపోతే పెద్ద ఎత్తున బీసీలమంతా ఏకమై మీ ఇల్లును ముట్టడిస్తామని రాష్ట్రంలో ఎక్కడ తిరగబోనియ్యమన్నారు.



## ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలి

- **ట్రైనీ డీప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి**

**చిట్యాల, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రైనీ డీప్యూటి కలెక్టర్ గండ్ర నవీన్ రెడ్డి హాజరై విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో విద్యాభ్యాసం కొనసాగించి ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ తౌటం లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినుల విద్యాభివృద్ధి సంక్షేమానికి గ్రామపంచాయతీ తరఫున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వసంతరావు ఎంపీడీవో జయశ్రీ ఎంఈఓ రఘుపతి ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ ఐకెపి ఏపీఎం కోటేశ్వరరావు సీసీ బుర్ర సాంబశివుడు మండల సమైక్య అధ్యక్షురాలు ఉమా కార్యదర్శి నిర్మల కోశాధికారి స్వప్న అకౌంటెంట్ సరస్వతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోడు భూములలో కందకాలు తీయడం నిలిపివేయాలని ధర్నా



**గోవిందరావుపేట, జూలై, 16 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి అటవీ శాఖ అధికారులు పోడు భూముల కందకాలు తీయడం నిలిపివేయాలని కోరుతూ గురువారం పసర లోని అటవీశాఖ ముందు గురువారం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం ములుగు జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ మాట్లాడుతూ తొమ్మిది గ్రామాలలో పోడు చేసుకుంటున్న సాగు దారులతో సాగు చేసుకుంటున్న పోడుభూములలో కంధకాలు తీయడం తక్షణమే నిలిపివేయాలి అన్నారు. గత 20 సంవత్సరా లుగా పోడు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసి భూములపై గత వారం రోజుల నుండి ఫారెస్ట్ అధికారులు కందకాలు తీయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తినే అన్నంలో మన్ను పోయడం ఎంత మూర్కత్వమో పంట పండించుకునే భూమిలో కంధకాలు తీయడం అంతే అవివేకమని ఆయన అన్నారు. పోడు వ్యవసాయం వలన కరువు కాటకాలు ఏర్పడుతున్నాయన్న అటవీ అధికారుల మాటలు అర్థం లేదన్నారు, ఛత్తిసఘడ్ రాష్ట్రంలో హసదె అడవుల్లో ఇరవై వేల ఎకరాలు భూమిని ఆధాని కంపెనీ కి అప్పనంగా అప్పచెప్పటం మూలంగా 24 లక్షల చెట్లు కూల్చి వేసినప్పుడు అటవీ శాఖఎం చేసిందని ఆయన ప్రశ్నించారు,ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు కళ్ళు తెరవాలని పోడు సాగుదారు లపై దాడులు ఆపాలని అన్నారు అలాగే ములుగు ఎమ్మెల్యే గా గెలిచి మంత్రి సీతక్క స్పందించి వెంటనే సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడాన్ని నిలిపివేసితనవంతు పాత్ర పోషించాలని అన్నారు. అడవిలో జంతువులకు రక్షణ కల్పించే అటవీ శాఖ ఆరుగంటలు ఆఫీస్ ముందు ధర్నా చేస్తుంటే ఎవరూ పట్టించుకోకోక పోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తరఫున పోడు భూములలో కంధకాలు తీయడం ఆపాలని అటవీ శాఖకు డిమాండ్ చేశారు, లేనియెడల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు, కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి, కమిటీ సభ్యులు అలెం అశోక్, వంక నాగేష్ కోటే కృష్ణారావు, గోనెపల్లియి ఎలుబాకసార్లమ్మ గుంపు, తక్కల్ల గూడెం,కాల్వపల్లి, ముసలమ్మ పేట, మొండ్యాలతోగు ప్రజలు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి : మల్లేష్



**చిట్యాల, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణలో నిరుద్యోగులు కనీస అవస రాలు తీర్చుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని వారికి విద్య అర్హతను బట్టి నిరుద్యోగ భృతి చెల్లించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడ్డారని తెలంగాణ స్వరాష్ట్రంలో కూడా అదే పరిస్థితితో నిరుద్యోగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల ఆకలి ఆర్థిక కనీస అవసరాల బాధను అర్థం చేసుకొని వారికి ప్రతి నెల నిరుద్యోగ భృతి రూ. 5000 అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుద్యోగులను ఆదుకోవాలని అన్నారు.

## సీతారామ పంప్‌హౌస్ పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్ట్



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 16 (పీపుల్స్ డైరీ) :** సీతారామ సాగర్ పంప్‌హౌస్‌ను సందర్శించేందుకు వస్తున్న మంత్రుల పర్యటనను నిరసిస్తూ అశ్వాపురం వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను ఇల్లందు పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో వెళ్లేందుకు సిద్ధమైన నాయకులను పోలీసులు ముందస్తు చర్యగా అడ్డుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన వారిని అరెస్ట్ చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. అరెస్టైన వారిలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, మాజీ పట్టణ అధ్యక్షుడు జబ్బార్ మొహమ్మద్, మాజీ మండల అధ్యక్షుడు శీలం రమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబి,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గాజీ, హరిప్రసాద్ యాదవ్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హయాంలో సీతారామ ప్రాజెక్టు దాదాపు 90 శాతం పూర్తయిందని, ప్రాజెక్టు పరిధిలోని భద్రాద్రి జిల్లా రైతులకు సాగునీరు అందించకుండా ఇతర ప్రాంతాలకు నీటిని మళ్లించడం అన్యాయమని ఆరోపించారు. రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, సన్నవడ్లకు రూ.500 బోనస్ వంటి ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. జిల్లాకు వచ్చిన నలుగురు మంత్రులు ముందుగా భద్రాద్రి జిల్లా ప్రజలకు సమాధానం చెప్పి, క్షమాపణలు తెలియజేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దాలి : సీపీఎం

### ఇల్లందు ఏరియా ఆస్పత్రిలో సర్వే నిర్వహించిన మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్

**రెగ్యులర్ డాక్టర్లు, సిబ్బంది, అంబులెన్స్, ఐసీయూ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్**






**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 16 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆస్పత్రిలో నిర్వహించిన సర్వేలో రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు సూచించిన మందులు అందుబాటులో లేక రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతమైన ఇల్లందులో సీజనల్ వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఏరియా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో అవసరమైన మందులను సమృద్ధిగా నిల్వ ఉంచాలని కోరారు. ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కాంట్రాక్టు సిబ్బందిపై ఆధారపడుతున్న పరిస్థితిని మార్చాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కార్మికులు లేక పరిశుభ్రత దెబ్బతింటోందని, వెంటనే అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. అంబులెన్స్ సౌకర్యం లేక ఖమ్మం, కొత్తగూడెం ఆస్పత్రులకు వెళ్లే రోగులు ప్రైవేట్ అంబులెన్స్‌లపై ఆధారపడి ఆర్థిక భారం మోస్తున్నారని పేర్కొన్నారు. అలాగే టీబీ విభాగంలో సిబ్బంది నియామకం, ఐసీయూ, వెంటిలేటర్ వంటి అత్యవసర వైద్య సౌకర్యాల కల్పన అవసరమన్నారు. నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్వేలో గుర్తించిన సమస్యలను జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఉద్యమిస్తామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ, సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

## వంకాయ గూడెం నర్సరీలో పైపుల అపహరణ

**శంకరపట్నం జులై 16 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని వంకాయగూడెం గ్రామంలోని ప్రభుత్వ నర్సరీలో వాచర్‌గా పనిచేస్తున్న బత్తుల కొమురయ్య బుధవారం సాయంత్రం యథావిధిగా చెట్లకు నీళ్ల పట్టి ఇంటికి వెళ్లారు. మళ్లీ గురువారం తెల్లవారుజామున చెట్లకు నీళ్లు పట్టేందుకు వచ్చేసరికి, రాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు నర్సరీలోని నీటి పైపులను దొంగిలించినట్లు ఆయన గుర్తించారు. దొంగిలించిన పైపుల విలువ దాదాపు రూ. 3,000 ఉంటుందని బాధితుడు తెలిపారు.

## కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టుల ప్రగతి

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** ఆనాడు కాంగ్రెస్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గురై కునారిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని జలయజ్ఞం అని ధనయజ్ఞంగా మార్చి మొబిలైజేషన్ అడ్వాన్స్ ల పేరిట దోపిడీ చేసి ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మార్చిందని విమర్శించారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9 వేల కోట్లు వెచ్చించి, 100 కిలోమీట ర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని, అధిక సామర్థ్యం గల మోటార్లు, ఆధునిక యాంత్రిక పరికరాలను ఏర్పాటు చేయ డం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వా నికే దక్కుతుందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగానికి సాగర్ ఆయకట్టుకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడం, వ్యవసాయాభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును రూపుదిద్దారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు సీతారామ ప్రాజెక్టుకు తాము ఎంత మేర నిధులు ఖర్చు చేశారో చేసిన కృషి ఏమీ లేక ప్రజలకు చెప్పుకునే విషయాలు లేకపోవడంతో కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శిం చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులనే తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం కాంగ్రెస్ మంత్రులు చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఎవరి కృషి ఏమిటో వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలుసని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ మరింత పటిష్టంగా జరగాలి

### డివిజన్ల వారీగా పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ వెంకన్నతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్



**హనుమకొండ, జులై 16 (పీపుల్స్ డైరీ) :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, నగర పరిశుభ్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు, బయోమెట్రిక్ హాజరు, ప్లాస్టిక్ నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై డివిజన్ల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జీడబ్ల్యూఎంసీ పరిధిలో పాయింట్ ఆఫ్ సేల్ మెషీన్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదాయ వసూళ్లలో పారదర్శకత తీసుకురావాలని, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

### వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి

వర్షాకాలంలో మురుగునీరు నిల్వ కాకుండా నగరంలోని అన్ని అంతర్గత మురుగుకాలువల్లో 100 శాతం డీ-సిల్టింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట యంత్రాలతో పాటు గ్యాంగ్‌మెన్‌లను వినియోగించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

## యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



**ఖమ్మం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయాయని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి.మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.



## గ్రిడ్ కార్మికుల వివరాలు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**ఏన్కూరు, జూలై 16 పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులోని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న మిషన్ భగీరథ గ్రిడ్ కార్మికుల పరిశీలన ప్రక్రియను గురువారం అడిషనల్ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. కార్మికులతో మాట్లాడారు. కార్మికుల వివరాలు సమగ్రంగా ఉండే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ భాగ్యశ్రీ, ఎంపిఓ జివిఎస్ నారాయణ, గ్రిడ్ ఏఈఈ తదితరులు పాల్గొన్నారు.

## పంట కుంటల ప్రాముఖ్యతపై అవగాహన



**ఏన్కూరు జూలై 16 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని రాయమాదారం గ్రామంలో గురువారం సహాయ వ్యవసాయ సంచాలకులు వైరా టీ కరుణశ్రీ పర్యటించారు. ఈ పర్యటనలో పంట కుంటల ప్రాముఖ్యతను వాటిని ఏర్పాటు చేసుకునే విధానాన్ని రైతులకు సవివరంగా చెప్పారు. పంట కుంటలు ఏర్పాటు చేసుకోవడం వలన భూగర్భ జలాన్ని పెంచుకోవచ్చని అత్యవసర సమయంలో పంటకు నీటిని అందించడానికి ఉపయోగపడు తుందని తెలిపారు. గ్రామంలో పంట కుంటలను నిర్మించబోయే ప్రదేశాలను మండల వ్యవసా య అధికారి ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ, పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్ గ్రామ రైతులు బాలాజీ, లక్ష్మీనారాయణ, వీరబాబు, రైతులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్‌కు సీపీ అభినందనలు

**ఖమ్మం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మూడు పతకాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. హైదరాబాద్ లో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్--2026లో పిల్లి రాజు, వుషూ--స్వర్ణ పతకం రెజ్లింగ్--రజత పతకం, కెన్‌కెన్ సిలాట్ --కాంస్య పతకాలు సాధించారు. అదేవిదంగా జూలై 12న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కెజిఏఫ్)లో నిర్వహించిన కెజిఏఫ్ అల్ట్రా గోల్డ్ రన్ 70కె ను 9గంటల 31 నిముషాలు 31సెకండ్‌లలో విజయవంతంగా పూర్తి చేశారు.

## మాలలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిద్దాం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** భద్రాచలం పట్టణంలో ఇటీవల మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన మాలల బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర గనులు కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాల సమాజానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ హైదరాబాద్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని మాల మహానాడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి దామల సత్యం పేర్కొన్నారు. భద్రాచలం సభలో మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... "మాల జాతి కోసం ఎంత దూరమైనా వస్తాను. అవసరమైతే మంత్రి పదవిని సైతం వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు పదవులు కాదు, మాల జాతి ముఖ్యం" అని ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, మాలలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తానని భద్రాచలం సభలో ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించడం హర్షణీయమన్నారు. భద్రాచలం సభ ద్వారా జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మాల సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపిన మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పావు్రాజ్, జిల్లా నాయకులు ఏవీ రావు, జిల్లా కార్యదర్శి ఏ.వీరబాబు, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు నీళ్లు జిల్లా రైతంగానికి అందించాలి



**కరకగూడెం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చలో మణుగూరు కార్యక్రమానికి బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సోమయ్య,బుడగం రాము,రేగా సత్యనారయణ,కొమరం రాంబాబు,కొమరం సత్యనారయణ,రావుల కనకయ్య,అత్తె సత్యనారయణ,మలకం వెంకటేశ్వర్లు,గుడ్ల రంజిత్ కుమార్,పాయం నర్సింహారావు,పాయం క్రిష్ణ,దాసరి సాంబయ్య,చిట్టిమల్ల ప్రవీణ్,బందు సతీష్ ముందస్తు అరెస్ట్ చేసిన కరకగూడెం పోలీసులు.అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదని,జిల్లా రైతాంగానికి నీళ్లు ఇచ్చేదాకా పోరాటం ఆగే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## సీతమ్మసాగర్ పనులను అశ్వాపురంలో పరిశీలించిన మంత్రులు



పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం.. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
ప్రాజెక్టు పూర్తైతే వేలాది ఎకరాలకు సాగునీరు..
రైతులకు భారీ ప్రయోజనం

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 16 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రులు అశ్వాపురం మండలంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా పాల్గొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతి, నాణ్యత, కాలువల నిర్మాణం, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యానికి తావివ్వొద్దని అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు



**ఖమ్మం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ దుకాణాలలో గంజాయిని చాక్లెట్లు, సిగరెట్, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ మోహన్ బాబు ఆధ్వర్యంలో ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాడుబడ్డ బంగ్లాలు, నిర్మానుష ప్రాంతాలు, పార్కులు, కిరాణా దుకాణాలు, పాన్‌డబ్బాలలో తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

## చైన్ స్నాచర్‌కు జైలు శిక్ష, జరిమాన

**ఖమ్మం, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** నగరంలోని జూబ్లీపురా ప్రాంతంలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న పెనుగొండ లక్ష్మీకాంతం అనే ఓ మహిళ మెడలో ఉన్న బంగారం చైన్ తెంపుకుని పారిపోయిన ఎడరబోయిన సుమన్, (39)కు మూడేళ్ళ ఆరు నెలల జైలు శిక్ష, 30 వేల జరిమానా విదిస్తూ.. ఖమ్మం 3వ అదనపు జెఎఫ్ సిఎం కోర్టు న్యాయమూర్తి అరవ ప్రవీణ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2026 మే 4న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలోని వ్యాపారం పనులు ముగించుకొని గాంధీచౌక్ నుండి జూబ్లీపురాలోని ఇంటికి ఒంటరిగా వెళుతున్న పెనుగొండ లక్ష్మీకాంతం (51) అనే ఓ మహిళ మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం చైన్‌ను గుర్తు తెలియని నిందితుడు తెంపుకుని పారిపోయాడని బాధితిరాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాపు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయ స్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన రెండు నెలలలో నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారి ఇన్స్పెక్టర్ జె.మోహన్ బాబు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. గాయత్రి, కోర్టు కానిస్టేబుల్ వి.రామకృష్ణ, కోర్టు అనుసంధాన అధికారులు ఎస్సై కె. శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ డి. నాగేశ్వరరావును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం

### మంత్రి పొంగులేటి



**మణుగూరు, జూలై 16(పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ



**పినపాక, జూలై 16 (పీపుల్స్ డైరీ) :** పినపాక మండలంలోని పోతురెడ్డిపల్లి విద్యాశాఖ – సమగ్ర శిక్ష తెలంగాణ మరియు ఎలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గ స్థాయి దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ శిబిరం బుధవారం పోతురెడ్డిపల్లి ఎం.పి.యు.పి.ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పినపాక ఎం.పి.డి.ఓ సంకీర్త్ మరియు ఎం.ఈ.ఓ కె. నాగయ్య హాజరై దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు, నడక కర్రలు, కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.పి.డి.ఓ సంకీర్త్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రతి విద్యార్థి విద్యలో రాణించి సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. అదేవిదంగా ఎం.ఈ.ఓ కె. నాగయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలిమ్కో సభ్యులు, పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, జడ్.పి.హెచ్.ఎస్ పినపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఐ.ఇ.ఆర్.పీలు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది మరియు సి.ఆర్.పీలు పాల్గొన్నారు. ఉపకరణాలు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com